సాక్షి
నిజామాబాద్
మంగళవారం ၊ 21 ၊ జనవరి ၊ 2025



త్వరలో జిల్లాకు పోలీస్ బాస్

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే జిల్లాకు నూతన పోలీస్ కమిషనర్ రానున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

- 8లో ▸



ఉద్యాన క్షేత్రంలో మంటలు

మాల్తుమ్మెదలోని ఉద్యాన క్షేత్రంలో రాత్రి ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో తోటలు దగ్ధమయ్యాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /10.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

మహాకుంభమేళాలో జలాభిషేకం



సుభాష్‌నగర్: పసుపు రైతుల దశాబ్దాల కల నెరవేర్చిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి చిత్రపటానికి మహాకుంభమేళా త్రివేణి సంగమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ మంగ్లారపు నవీన్ గంగాజలంతో సోమవారం అభిషేకం నిర్వహించారు. పసుపును బంగారంగా భావించే రైతుల కుటుంబాల్లో బోర్డు ఏర్పాటుతో ఆనందం వెల్లివిరిసిందని, అందుకు కారణమైన ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ ధర్మపురి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి చిత్రపటాలకు జలాభిషేకం చేశారు. బోర్డు ప్రకటించి ఏర్పాటు చేసినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ద్యాగ ప్రశాంత్, క్రాంతి, వంశీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు స్పౌజ్ బదిలీలు

- జిల్లాకు 51 మంది రాక

నిజామాబాద్‌అర్బన్: స్పౌజ్ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వివిధ జిల్లాల్లో పని చేస్తున్న జిల్లాకు చెందిన 51 మంది ఎస్జీటీ టీచర్లు సొంత జిల్లాకు రానున్నారు. వీరికి బుధవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కొన్నేళ్లుగా వేరే జిల్లా ల్లో పనిచేస్తున్న టీచర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో నిరసనలు కార్యక్రమాలు చేపట్టారు. స్కూల్ అసిస్టెంట్‌లకు గతంలోనే స్పౌజ్ బదిలీలు జరిగాయి. ఎస్జీటీ టీచర్ల స్పౌజ్ బదిలీలపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

చెక్కుల పంపిణీ బహిష్కరణ : ఎమ్మెల్యే

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో ఈ దఫా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు లేఖ రాశారు. కాంగ్రెస్ అధి కారంలోకి వస్తే కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతో పాటు,తులం బంగారం ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా తులం బంగారం ఇవ్వకపోవడంతో నిరసనగా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా లబ్ధిదారులకు చెక్కులు అందించాలని సూచించారు.

ఠాణాలో మాటలు రాని బాలుడు



ఖలీల్‌వాడి: తప్పిపోయి వచ్చిన బాలుడు నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్‌లో ఉన్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. తొమ్మిదేళ్ల ఆ బాలుడికి మాటలు రావన్నారు. బాలుడి గురించి తెలి సిన వారు 8712659714 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు
కీలక బాధ్యతలు



ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో వ్యూహాత్మక ప్రణాళికల అమలు

ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఎంపీ అర్వింద్‌కు బీజేపీ అధిష్టానం కీలకమైన బాధ్యతలు అప్పగించింది. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం తనకు కేటాయించిన నియోజకవర్గాల్లో ప్రణాళికలు, వ్యూహాలు అమలు చేయనున్నారు. కాగా ఇప్పటికే ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందిన అర్వింద్ పేరును రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి పార్టీ అధినాయకత్వం పరిశీలిస్తోంది.

- బీజేపీ జాతీయ నాయకత్వంతో కలిసి పర్యవేక్షణ
- ఎన్నికల అనంతరం పసుపు బోర్డు ఏర్పాటు నేపథ్యంలో ఇందూరులో సభ!
- కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌లలో ఒకరి రాక

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు బోర్డు ఏర్పాటు విషయంలో తిరుగులేని విజయం సాధించి ఇందూరు రాజకీయాలను మలుపు తిప్పిన ఎంపీ అర్వింద్‌కు ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో కీలకమైన వ్యూహాత్మక ప్రణాళికల అమలు బాధ్యతలను బీజేపీ అధిష్టానం అప్పగించింది. జాతీయ నాయకత్వంతో కలిసి ఢిల్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం వ్యూహాత్మక ప్రణాళికల అమలు బాధ్యతలను అర్వింద్ పర్యవేక్షించనున్నారు. బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు 15 మంది, ఢిల్లీ ఎన్నికలకు సంబంధించి వ్యూహాలు, ప్రణాళికలు అమలు చేసే విషయంలో కసరత్తులు చేస్తున్నారు. ఎంపీకి కేటాయించిన నియోజకవర్గాల్లో ప్రణాళికలు, వ్యూహాలు అమలు చేయనున్నారు. అదేవిధంగా ఢిల్లీలోని తెలుగు సమాజంతో కలిసి అర్వింద్ పనిచేయనున్నారు.

ఇదిలా ఉండగా ఏకంగా ప్రధానమంత్రితో పసుపు బోర్డు ప్రకటన చేయించడంతో పాటు ఇందూరులోనే బోర్డు ఏర్పాటును అమిత్ షాతో ఎంపీ అర్వింద్ ప్రకటన చేయించిన విషయం తెలిసిందే. ఇక దేశంలోని పసుపు రైతులందరికీ అన్నిరకాల సేవలందించే పసుపు బోర్డు చైర్మన్ పదవిని తనకు అత్యంత సన్నిహితుడైన, జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నేత పల్లె గంగారెడ్డికి ఇప్పించుకున్నారు. సీనియర్ ఐఏఎస్‌లు, పసుపు రైతులు, ట్రేడర్లు సభ్యులుగా ఉండే ఈ బోర్డు చైర్మన్ పదవిని జిల్లాకు చెందిన వ్యక్తికి దక్కేలా చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందిన ఎంపీ అర్వింద్ పేరును రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి పార్టీ అధినాయకత్వం పరిశీలిస్తోంది.

ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీకి అత్యధిక ప్రాబల్యం ఉన్న ప్రాంతంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నిలిచింది. దీంతో పార్టీ అధినాయకత్వం ఎంపీ అర్వింద్‌కు ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. ఢిల్లీలో ఇంత ప్రాధాన్యత ఉన్నందునే పసుపు బోర్డు విషయమై పట్టిన పట్టు విడువకుండా ఎంపీ అర్వింద్ మహారాష్ట్రకు చెందిన సీనియర్ కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్‌లతో పోటీ పడ్డారు. జిల్లాలో బోర్డు ఏర్పాటు చేసేలా చక్రం తిప్పి విజయం సాధించారు.

అర్వింద్ ఆధ్వర్యంలో బహిరంగ సభ

ఢిల్లీ శాసనసభ ఎన్నికల అనంతరం ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటు నేపథ్యంలో భారీ సభ నిర్వహించనున్నారు. ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లలో ఒకరు హాజరు కానున్నట్లు తెలుస్తోంది.

విద్యారంగ అభివృద్ధికి చర్యలు



ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మేయర్ నీతూకిరణ్ తదితరులు

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్: విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 11 మందికి అవార్డులు అందజేసి, సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ గాడి తప్పిందన్నారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిధులు కేటాయించి పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, భవనాల మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఎంఈవోలు సాయారెడ్డి ,సేవ్లా, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన రాజన్న చెంతకు..

- 60 కిలోమీటర్లు పాదయాత్రగా కదిలిన మహిళలు

సిరిసిల్ల: మొక్కు తీర్చుకోవాలన్న తలంపు వారిని పాదయాత్రగా కదిలించింది. దాదాపు 60 కిలోమీటర్లు నడిచి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన 28 మంది మహిళలు వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కాలినడకన బయలుదేరారు. ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం ఉన్నా.. కాలినడకన రావాలన్న మొక్కు తీర్చుకునేందుకు సోమవారం ఉదయం 6 గంటలకు పల్లికొండ నుంచి నడకను ప్రారంభించారు. సోమవారం రాత్రి సిరిసిల్ల జిల్లా చందుర్తి లో బసచేసి, మంగళవారం వేములవాడకు చేరుకొని రాజన్నను దర్శించుకోనున్నారు.



వేములవాడకు కాలినడకన వెళ్తున్న పల్లికొండ మహిళలు

గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: గణతంత్ర దినోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమ న్వయంతో పని చేయాలన్నారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని సూచించారు. ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న రైతు భరో సా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రతా (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి శకటాలను ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. వీటితోపాటు గృహజ్యోతి, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ప్రాధాన్యతను చాటేలా శకటాలను ప్రదర్శించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రాధాన్యతనిస్తూ, ఈ నెల 22 లోగా పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫార్సు చేయాలని అధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. దేశభక్తిని చాటేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

వార్డు, గ్రామ సభలకు సిద్ధం

- నేటి నుంచి 24 వరకు నిర్వహణ
- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- సభలలో దరఖాస్తుదారుల వివరాలను ప్రకటించనున్న అధికారులు
- అనర్హులుగా తేలితే జాబితా నుంచి తొలగించే అవకాశం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ నెల 24 వరకు ఈ సభలు జరుగుతాయి. ఇందు లో ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరో సా, రేషన్‌కార్డుల అర్హులను గుర్తించనున్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు గ్రామ సభలు జరుగుతాయి. ఈ సభలకు ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ సెక్రెటరీలు వివిధ శాఖల ఉద్యోగులు హాజరవుతారు. సభలలో గ్రామంలో గతంలో ప్రజాపాలనకు దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు ప్రదర్శిస్తారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు లేని వారి వివరాలు ఉంటాయి. వీటితో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తు దారుల వివరాలు ఉంటారు. దరఖాస్తుదారుల పేర్లను అధికారులు గ్రామ సభలో చదివి వినిపిస్తారు. దరఖాస్తులు ఆయా పథకాలకు అర్హులేనా ? అని గ్రామసభలో అడుగుతారు. దీంతో ఎవరైనా దరఖాస్తుదారుడు తప్పుడు సమాచారం ఇస్తే బహిర్గతమవుతుంది. తక్షణమే అధికారులు విచారణ చేపడతారు. ఒక వేళ దరఖాస్తు దారుడు సంబంధిత పథకానికి అర్హుడేనని గ్రామస్తులు తెలిపితే లబ్ధిదారుడిని జాబితాలో ఎంపిక చేస్తారు. కాగా ప్రజాపాలనలో జిల్లా వ్యాప్తంగా 320831 దరఖాస్తులు వచ్చాయి. వీటిని గత కొన్ని రోజులుగా అధికారులు పరిశీలన చేసి క్షేత్రస్థాయిలో విచారించారు. ఇందులో ఇళ్ల కోసం, రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలు నమోదు అయ్యాయి.

జిల్లాలోని నిజామాబాద్ మున్సిపల్ కార్పొ రేషన్ పరిధిలో 86208 ప్రజాపాలన దరఖాస్తులు, ఆర్మూర్ మున్సిపాలిటీలో 11402, భీంగల్ మున్సిపాలిటీలో 2459, బోధన్ మున్సిపాలిటీలో 14956 దరఖాస్తులు వచ్చాయి. రూరల్ పరిధిలో 27 మండలాలకు సంబంధించి 2346 23 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు వీటిని పరిశీలించారు.



మొత్తం 672 సభలు

గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్‌లలో మొత్తం 146 వా ర్డులు ఉన్నాయి. వీటిని 20 క్లస్టర్‌లుగా విభజించారు. 20 ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో గ్రామ సభల కోసం 530 పంచాయతీలను 113 క్లస్టర్‌లుగా విభజించారు.113 మంది ప్రత్యేక అధికారులను నియమించారు. ఇందులోఎంపీడీవోలు, తహసీల్దార్‌లు ఉన్నారు. ఈనెల 21న 200 వార్డు, గ్రామ సభలు, 22న 199 సభలు, 23న 177 సభలు, 24న 96 సభలు నిర్వహించనున్నారు. మొత్తం కలిపి 672 సభలు జరుగనున్నాయి.

స్మార్ట్‌గా వ్యవసాయం

- ఆధునిక యంత్రాలతో పసుపు సాగు
- యంత్రంతోనే పసుపు విత్తడం, తవ్వకం
- కర్కుమిన్ అధికంగా వచ్చే వంగడాల సాగు
- కూలీల సమస్య అధిగమిస్తూ, పెట్టుబడి వ్యయం తగ్గించుకుంటూ..
- రైతురత్న అవార్డు గ్రహీత చిన్నారెడ్డి



పసుపు విత్తే యంత్రం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: యాంత్రీకరణ ఉపయోగిస్తూనే స్మార్ట్‌గా పసుపు పంటను సాగు చేస్తున్నాడు ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన యువరైతు నలిమెల చిన్నారెడ్డి. కూలీల సమస్య అధిగమిస్తూనే, పెట్టుబడి వ్యయం భారీగా తగ్గించుకుంటున్నాడు. అధిక దిగుబడితో రాబడి సాధిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. తన కున్న 12 ఎకరాల్లోని 6 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నాడు. ఆదర్శ రైతుగా గుర్తింపు తెచ్చుకుని 2019లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతురత్న అవార్డును సైతం అందుకున్నాడు.

అన్ని పనులు యంత్రాలతోనే..

పసుపు సాగుకు వ్యవసాయ క్షేత్రాన్ని సిద్ధం చేసుకోవడానికి కల్టివేటర్, బెడ్ మేకర్(దీంతో మూడు అడుగుల వెడల్పు, అడుగు ఎత్తులో బెడ్ వేస్తారు), పసుపు విత్తుకోవడానికి ప్లాంటర్, కలుపు తీసేందుకు మినీ పవర్ టిల్లర్, పసుపు తవ్వకానికి టర్మరిక్ డిగ్గర్(దీంతో కూలీల ఖర్చు తగ్గుతుంది), పసుపు కొమ్ములు ఉడకబెట్టేందుకు బాయిలర్, పాలిషర్ యంత్రాలను చిన్నారెడ్డి ఉపయోగిస్తున్నాడు. దీంతో ప్రతి ఏటా వ్యవసాయ కూలీల సమస్యను అధిగమిస్తున్నాడు. బెడ్ మేకర్, ప్లాంటర్, టర్మరిక్ డిగ్గర్ వాడడం అరుదు. పూర్తి స్మార్ట్ యంత్రీకరణతో ఎకరంలో పసుపు సాగుకు రూ.1.5 లక్షల పెట్టుబడి అవుతుంది. చిన్నారెడ్డికి మాత్రం రూ.1లక్ష మాత్రమే ఖర్చు అవుతోంది. మరోవైపు కర్కుమిన్ శాతం అధికంగా ఉండే రాజేంద్ర సోని, ఏసీసీ–79, ప్రగతి, పీతాంబర్, రాజేంద్ర సోనాలి, రాజపురి, బీఎస్సార్–2 వంగడాలను సాగు చేస్తున్నాడు. స్థానికంగా సాగు చేసే పసుపులో 2 శాతం కర్కుమిన్ ఉంటుండగా, చిన్నారెడ్డి సాగు చేస్తున్న వంగడాలతో 4 నుంచి 5 శాతం కర్కుమిన్ వస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లి నూతన వంగడాలు, మార్కెట్ గురించి అధ్యయనం చేసిన చిన్నారెడ్డి 8 ఏళ్లుగా ఆధునిక విధానంలో సాగు చేస్తున్నాడు. పంటకు తెగులు సోకకుండా, వర్షం నీరు నిలిచి కొమ్ము మురిగి పోకుండా ఉండేందుకు ఎత్తుమళ్ల పద్ధతిలో సాగు చేయడం ఈ రైతు ప్రత్యేకత.

విత్తన పసుపు కోసం చిన్నారెడ్డి వద్దకు..

మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పసుపు రైతులు చిన్నారెడ్డి వద్ద విత్తన పసుపును కొనుగోలు చేస్తున్నారు. దీంతో శుద్ధి భారం సైతం తగ్గించుకుని ఆర్థికంగా లాభపడుతున్నాడు. విత్తనానికి అమ్మగా మిగిలిన పసుపును శుద్ధి చేసి నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో అమ్ముతున్నాడు. ఎకరానికి 100 నుంచి 150 క్వింటాళ్ల పచ్చి పసుపు దిగుబడి వస్తుండగా, పసుపు కొమ్ములను ఉడకబెట్టి, ఎండబెట్టి, పాలిష్ చేసిన అనంతరం 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడిని సాధిస్తున్నాడు. ఇక తన యంత్రాలను గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులకు సైతం అందిస్తూ చేదోడుగా ఉంటున్నాడు.



పసుపు కొమ్ములను ఉడకబెట్టే బాయిలర్

కర్కుమిన్ ఆధారిత మార్కెట్ కల్పించాలి



అధిక ప్రయోజనాలు కలిగిన నూతన వంగడాలను సాగు చేస్తున్న పసుపు రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. కర్కుమిన్ ఆధారిత మార్కెట్‌ను నిజామాబాద్‌లో ఏర్పాటు చేయాలి. కష్టపడి నూతన వంగడాలను సాగు చేస్తున్నప్పటికీ ఆశించిన ధర లభించడంలేదు. లోకల్ పసుపునకు లభించే ధరపై 25 నుంచి 30 శాతం అదనంగా కర్కుమిన్ శాతం ఎక్కువ ఉన్న పసుపునకు ధర కల్పిస్తే గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం పసుపు రైతులను ఆదుకునే విధంగా నిర్ణయాలు తీసుకోవాలి.

– నలిమెల చిన్నారెడ్డి , రైతు

చట్టం పరిధి దాటి రాష్ట్ర ప్రభుత్వ అప్పులు

- పసుపు బోర్డు దేశానికే గర్వకారణం
- బోర్డు ఏర్పాటుపై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు హాస్యాస్పదం
- బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శ



మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బీఎం) చట్టం పరిధిని దాటి అప్పులు చేస్తోందని బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అయినా ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేక పోతున్నారని ఆరోపించారు. సోమవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ సంవిధాన్ గౌరవ దివస్ వర్క్‌షాప్ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పసుపు బోర్డు ఏర్పాటు చేయడం దేశానికే గర్వకారణమని, ఇది సాధించిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు అభినందనలు తెలియజేశారు. పసుపు బోర్డు ఏర్పాటుపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఎంపీ అర్వింద్ పేరును రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి రేసులో నుంచి తొలగించేందుకే పసుపు బోర్డు ఏర్పాటు అనేది అవాస్తవమని అన్నారు. రాష్ట్రంలో 13 నెలల్లో 13 కుంభకోణాలు ఆధారాలతో సహా బయట పెట్టినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. కాంగ్రెస్ స్వార్థం కోసం పని చేస్తే.. బీజేపీ ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తోందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అధిష్టానం అతి త్వరలోనే నియమిస్తుందని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

11 నుంచి 25 వరకు సంవిధాన్ గౌరవ్ అభియాన్

భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా ఆదేశాల మేరకు జనవరి 11 నుంచి 25 వరకు సంవిధాన్ గౌరవ్ అభియాన్‌ను నిర్వహిస్తున్నట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22, 23 తేదీల్లో ఎస్సీ, ఎస్టీ బస్తీల్లో సమావేశాలు, 24, 25 తేదీల్లో కళాశాలలు, హాస్టళ్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు, రాజ్యాంగం పట్ల బీజేపీ నిబద్ధతను తెలియ జేస్తారని తెలిపారు. 26న ప్రతి బూత్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు, రాజ్యాంగంలోని ప్రవేశిక, ఆదేశిక సూత్రాలను చదివి విన్పించాలన్నారు. కార్యక్రమాలు విజయవంతమయ్యేలా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, నక్క రాజేశ్వర్, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



నిజామాబాద్‌ అర్బన్‌: నగరంలోని హరిచరన్‌ జూనియర్‌ కళాశాలను జిల్లా ఇంటర్‌ విద్య అధికారి రవికుమార్‌ సోమవారం తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్‌, అధ్యాపకులతో సమావేశమయ్యారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఇంటర్‌ ప్రయోగ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంతో పాటు వార్షిక పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కళాశాలలో ప్రయోగశాలల నిర్వహణపై సమీక్షించారు.

'సమాధానం చెప్పలేక ప్రభుత్వంపై నిందలు'

నిజామాబాద్‌ సిటీ: బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పలేక రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి విమర్శించారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీని ఎమ్మెల్యే బహిష్కరించడంపై మానాల ప్రకటన విడుదల చేశారు. కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని, ఏడాది నుంచి ప్రశాంత్‌ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ప్రశాంత్‌ రెడ్డి తీరును కాంగ్రెస్‌ పార్టీ ఖండిస్తుందన్నారు. గతంలో ప్రశాంత్‌ రెడ్డి నిర్లక్ష్యంతోనే చెక్కులు ఆగిపోయాయన్నారు. ఆయన చేసిన తప్పుకు లబ్ధిదారులకు క్షమాపణ చెప్పాలన్నారు.

చిరుత కలకలం

మాచారెడ్డి: మాచారెడ్డి మండల సరిహద్దులో సోమవారం చిరుత కనిపించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో చిరుత దూడపై దాడి చేసింది. దీంతో గంభీరావుపేట, మాచారెడ్డి మండలాల ప్రజలు భయపడుతున్నారు.

ఉద్యాన క్షేత్రంలో చెలరేగిన మంటలు

- దగ్ధమైన పండ్ల తోటలు
- మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది



మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రంలో చెలరేగుతున్న మంటలు

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెదలోని ఉద్యాన క్షేత్రంలో సోమవారం రాత్రి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఉద్యాన క్షేత్రంలోని పండ్ల తోటలను మంటలు చుట్టుముట్టాయి. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఎల్లారెడ్డి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఎల్లారెడ్డి అగ్నిమాపక కేంద్రం అధికారి కిష్టయ్య ఫైర్‌ ఇంజిన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. మంటలతో ఉద్యాన క్షేత్రంలోని ఉసిరి, జామ, మామడి, ఆయిల్‌పాం తోటలు కాలిపోయాయి. సాయంత్రం నుంచే ఉద్యాన క్షేత్రంలో మంటలు వ్యాపించడం ప్రారంభమైందని తెలుస్తోంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఉద్యాన క్షేత్రంలో అధికారులెవరూ అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఉద్యానక్షేత్రంలో చెలరేగిన మంటల వల్ల జరిగిన నష్టంపై మంగళవారం స్పష్టత రానుంది.



ఉద్యాన క్షేత్రాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది



ఉద్యాన క్షేత్రంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

త్వరలోనే జిల్లాకు పోలీస్‌ బాస్‌!

- నెలాఖరులోగా నియమించే అవకాశం

ఖలీల్‌వాడి: జిల్లాకు త్వరలో పోలీస్‌ కమిషనర్‌ రానున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కొత్త సీపీ వస్తారని పోలీస్‌ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అక్టోబర్‌ 23న సీపీ కల్మేశ్వర్‌ కేంద్ర సర్వీసులకు బదిలీపై వెళ్లడంతో సీపీ పోస్టు ఖాళీ అయ్యింది. ఈ స్థానంలో కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా జిల్లాకు సీపీగా రావడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సీఎం విదేశాలకు వెళ్లడంతో సీపీ నియామకం ఈనెల ఆఖరు వరకు అయ్యే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. కాగా జిల్లాకు డైరెక్ట్‌ ఐపీఎస్‌ను తీసుకు రావడానికి సీనియర్‌ కాంగ్రెస్‌ నేత, ప్రజాప్రతినిధి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు డైరెక్ట్‌ ఐపీఎస్‌తోపాటు సమర్థుడి కోసం వెతుకుతున్నట్లు సమాచారం.

మంత్రి సమీక్షలో చర్చ

నిజామాబాద్‌ కలెక్టరేట్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులతో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ పోస్టుపై చర్చ జరిగింది. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ సీపీ లేకపోవడంతో జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. దీంతో బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జోక్యం చేసుకొని సమర్థుడిని కోసం వెతుకుతున్నామని అందుకోసమే సీపీ పోస్టు ఖాళీగా ఉందన్నారు. త్వరలోనే సీపీ వస్తారని చెప్పారు.

సెలవులో వెళ్లనున్న ఇన్‌చార్జి సీపీ

ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ దీర్ఘకాలిక సెలవులో వెళ్లనున్నారు. అమెరికాలో ఎల్‌ఎల్‌ఎంకు అవకాశం రావడంతో వెళ్లనున్నట్లు తెలిసింది. అమెరికాకు వెళ్లే క్రమంలో హైదరాబాద్‌కు బదిలీ చేయించుకోవడానికి యత్నిస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాతే సెలవులో వెళ్తారని తెలిసింది.

వ్యవసాయేతర భూములను పక్కాగా గుర్తించాలి

- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు



అక్బర్‌ నగర్‌ శివారులో వ్యవసాయేతర భూముల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్‌

రుద్రూర్‌/వర్ని: వ్యవసాయ యోగ్యం కాని భూము భూములను పక్కాగా గుర్తించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు ఆదేశించారు. రుద్రూర్‌ మండలంలోని అక్బర్‌నగర్‌, రుద్రూర్‌, చందూర్‌ మండలంలో చేపడుతున్న సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. పంటలు సాగు చేయకుండా వ్యవసాయేతర అవసరాలకు భూములను వినియోగిస్తుండడం, ప్లాట్లుగా మార్చినట్లు గమనించిన కలెక్టర్‌ వాటి వివరాలు తెలుసుకున్నారు. గ్రామసభల నిర్వహణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో, రుద్రూర్‌ తహసీల్దార్‌ తారాబాయి, ఎంపీడీవో సురేష్‌ బాబు, ఏవో సాయికృష్ణ, చందూర్‌ ఎంపీడీవో నీలావతి, తహసీల్దార్‌ శాంత పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో సోమవారం ఎల్‌ఎల్‌బీ ఐదో సెమిస్టర్‌ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాన్ని వీసీ యాదగిరిరావు తనిఖీ చేశారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. ఈ పరీక్షలకు 28 మంది విద్యార్థులకు 26 మంది హాజరైనట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు.

23న 'గార్డ్‌' టీజర్‌ విడుదల



మాట్లాడుతున్న హీరో శీలం విరాజ్‌రెడ్డి

మోపాల్‌: మండలంలోని నర్సింగ్‌పల్లి శివారులోగల ఎస్‌ఆర్‌ఎస్‌ గార్డెన్‌లో ఈ నెల 23న సాయంత్రం 7 గంటలకు 'గార్డ్‌' సినిమా టీజర్‌ విడుదల చేస్తున్నట్లు సినీ హీరో శీలం విరాజ్‌ రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్‌ఆర్‌ఎస్‌ గార్డెన్‌లో ఆయన మాట్లాడారు. మోపాల్‌ మండలం కంజర్‌ గ్రామంలో పుట్టి పెరిగానని, మొదటిసారిగా గార్డ్‌ సినిమాలో హీరోగా నటించడం ఆనందంగా ఉందన్నారు. టీజర్‌ విడుదల సందర్భంగా జబర్దస్త్‌ కామెడీ షో ఆర్టిస్టులు వస్తున్నారని, నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. లాస్యరెడ్డి యాంకర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. టీజర్‌తోపాటు పాటలు కూడా విడుదల చేస్తామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని గూపన్‌పల్లి శివారులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరీఫ్‌ తెలిపారు. గూపన్‌పల్లి శివారులో గల చెరువులో మృతదేహం గమనించిన స్థానికులు తమకు సమాచారం అందించారని చెప్పారు. హత్య చేసి పడేసినట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని ఆయన తెలిపారు.

పశువుల పాక దగ్ధం



వర్ని: చందూరు మండలం ఘన్‌పూర్‌ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పశువుల పాక దగ్ధమైంది. గాలి పల్లె బోయికి చెందిన పశువుల పాకకు నిప్పంటుకోగా గమనించిన యజమాని గేదెలను ప్రమాదం నుంచి తప్పించారు. ప్రమాదంలో రూ. 50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వెల్లడించారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో మీ సేవ కేంద్రం..



బాన్సువాడ: బీర్కూర్‌ మండలం రైతునగర్‌లో ఆదివారం రాత్రి షార్ట్‌ సర్క్యూట్‌తో మీ సేవ కేంద్రం దగ్ధమైంది. కేంద్రంలో రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కంప్యూటర్‌, ప్రింటర్‌ తదితర వస్తువులు కాలి బుడిదయ్యాయి. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు ఫోన్‌ చేయడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బాల్కొండ: ముప్కాల్‌ ఉన్నత పాఠశాలలో 1987–88 లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం గ్రామంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్నా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

హత్య కేసులో భార్యాభర్తలకు జైలు

కామారెడ్డి టౌన్‌/ఎల్లారెడ్డి రూరల్‌: ఇంటి యజమానికి మత్తు మందు కలిపిన కల్లు తాగించి అతడి మరణానికి కారణమవడమే కాకుండా ఆ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దంపతులకు న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారు. ఎస్పీ సింధు శర్మ తెలిపిన వివరాలు.. 2018 సెప్టెంబర్‌ 24న గుంటూరు జిల్లాకు చెందిన దంపతులు గంజి దివ్య అలియాస్‌ లక్ష్మి, గంజి వెంకటేశం అలియాస్‌ గణేశ్‌ ఎల్లారెడ్డికి వచ్చారు. వస్త్ర వ్యాపారులుగా నమ్మించి వృద్ధ దంపతులైన కల్యాణి ఇంద్రమ్మ, శంకరయ్యల ఇంట్లో అద్దెకు దిగారు. వారం తర్వాత దివ్య, వెంకటేశం రెండు కల్లు సీసాలు తీసుకుని ఇంటికి వచ్చారు. ఒకటి ఇంటి యజమానికి ఇచ్చి మరొకటి వారు తీసుకుని వెళ్లారు. ఇంటి యజమానికి ఇచ్చిన సీసాలో అప్పటికే మత్తుమందు కలిపి ఉంచారు. ఆ కల్లు తాగిన శంకరయ్య మరణించగా ఇంద్రమ్మ నిద్రలోకి జారుకుంది. నిందితులు దివ్య, వెంకటేశం ఇంటి యజమాని కల్యాణి ఇంద్రమ్మ మెడలోని బంగారు పుస్తెలతాడు, చెవి కమ్మలతోపాటు బీరువా పగులగొట్టి అందులోని డబ్బు తీసుకుని పారిపోయారు. మరుసటి రోజు మృతుడి భార్య ఇంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. నిందితులను గుంటూరు జిల్లాలో విచారించగా నేరాన్ని అంగీకరించారు. సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి వీఆర్‌ఆర్‌ వరప్రసాద్‌ సోమవారం తీర్పు ఇచ్చారు. వెంకటేశంకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 4 వేల జరిమానా, దివ్యకు ఏడాది జైలు, రూ. 4 వేల జరిమానా విధించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కారు, బైక్‌ ఢీ : ఒకరికి గాయాలు

వర్ని: మోస్రా మండలం గోవూరు శివారులో సోమవారం కారు, బైక్‌ ఎదురెదురుగా ఢీకొన్నాయి. మహారాష్ట్రలోని బిలోలి గ్రామానికి చెందిన గైని రవి (37)సోమవారం చందూరు నుంచి బైక్‌పై నిజామాబాద్‌ వెళ్తుండగా కారు ఢీకొంది. ప్రమాదంలో రవికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 లో నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో భార్య, అత్తపై దాడి



గాయపడిన ఫర్జానా

రెంజల్‌: మద్యం మత్తులో భార్య, అత్తపై బ్లేడుతో దాడి చేశాడో వ్యక్తి. ఈ ఘటన రెంజల్‌ మండలం కందకుర్తి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఫర్జానాకు మహారాష్ట్రలోని భోకర్‌లో గల ఫారూఖ్‌ పటాన్‌తో వివాహం జరిగింది. మద్యానికి బానిసైన అతను భార్యను వేధించడంతో పెద్దలు సర్ది చెప్పి ఇద్దరిని కందకుర్తికి తీసుకవచ్చారు. ఇక్కడ కూలీ పనులు చేస్తు నిత్యం మద్యం తాగి భార్యను వేధించేవాడు. ఆదివారం రాత్రి తాగిన మత్తులో భార్యతో పాటు అత్త కమర్‌బేగంలపై దాడి చేశాడు. బ్లేడ్‌తో వారి గొంతుకోయడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఫర్జానా ఫిర్యాదు మేరకు ఫారూఖ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో జైలు

బోధన్‌టౌన్‌: డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ఒకరికి జడ్జి ఒక రోజు జైలు శిక్ష వేసినట్లు బోధన్‌ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని సోమవారం బోధన్‌ సెకండ్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ శేషతల్ప సాయి ఎదుట హాజరు పర్చగా జైలు శిక్ష విధించారన్నారు. అలాగే పట్టణంలోని బైపాస్‌ రోడ్డులో బహిరంగంగా మద్యం తాగిన ఐదుగురికి కమ్యూనిటీ సర్వీస్‌ శిక్ష వేశారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు.

జేసీబీ పట్టివేత

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌లో అనుమతి లేకుండా మొరం తీస్తున్న జేసీబీని ఆదివారం రాత్రి అధికారులు పట్టుకున్నారు. అనంతరం జేసీబీని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉంచారు. అధికారులు ఇంకా పంచానామా చేయలేదని తెలిసింది.